క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గీతా మహాయజ్ఞం



యజ్ఞం చేస్తున్న వేద పండితులు

పార్వతీపురం టౌన్: మండలంలోని చినబొండ పల్లిలో గల జగన్మాత ఈశ్వరీ మహదేవి పీఠంలో భక్తిశ్రద్ధలతో గీతాయజ్ఞం నిర్వహిస్తున్నారు. 40 రోజుల పాటు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పఠిస్తూ, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో పీఠాధిపతి సద్గురు శ్రీనివాసస్వామి మాట్లాడుతూ, గీతాయజ్ఞం చేయడం వల్ల విశ్వశాంతి, సమాజ శాంతి కలుగుతాయన్నారు. కార్యక్రమంలో రుత్వికులు, భక్తులు పాల్గొన్నారు.

విరాళం..

బలిజిపేట: పెదపెంకి ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి గ్రామానికి చెందిన జి.హరనాథ్ రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు చేతులమీదుగా ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

సీతానగరం: మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ అధ్యక్షుడు జి. ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సంఘం పోరాడుతుందన్నారు. కార్యవర్గ అధ్యక్షుడిగా బి.జోగులు, ఉపాధ్యక్షుడిగా కె.జోగయ్య, కార్యదర్శిగా తోట నాగయ్య, ఉప కార్యదర్శిగా జి. ఆనందరావు, ట్రెజరర్‌గా పిల్లి కాశీఅన్నపూర్ణేశ్వరి ఎన్నికయ్యారు.

త్వరితగతిన బోర్లకు మరమ్మతులు



క్రాస్‌ప్రోగ్రాం వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

బలిజిపేట: పాడైన బోర్లకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ నాగమణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా బోర్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధ చేశామని, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం మరమ్మతులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, ఏఓ భానుమూర్తి, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జగన్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారి ఎంఏ నాయుడు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని డీవీఎం పాఠశాలలో బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి ఎంఏ నాయుడు మాట్లాడుతూ.. బాలికలు హక్కులు, చెడు స్పర్శ, మంచి స్పర్శ, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.తవిటినాయుడు, ఓఆర్ డబ్ల్యూ రావాడ హరికృష్ణ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

మక్కువ: మండలంలో బంగారువలస గ్రామంలో ఇటీవల జరిగిన దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరసింహమూర్తి సోమవారం తెలిపారు. బంగారువలస గ్రామానికి చెందిన శంకర్ దొరపై, బంగారువలస, మక్కువ గ్రామాలకు చెందిన రెడ్డి శివప్రసాద్, అంబటి గణేష్ దాడి చేసినట్లు శంకర్ దొర భార్య సోమేశ్వరి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం సోమవారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పార్వతీపురంలో గెలుపు జెండా ఎగురవేద్దాం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



సమావేశానికి హాజరైన బూత్ కమిటీ సభ్యులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో గెలుపు జెండా ఎగురవేద్దామని, ప్రతి కుటుంబాన్ని బూత్ కమిటీ సభ్యులు సంప్రదించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో పట్టణ, మండల పరిధిలో గల బూత్ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదనే లక్ష్యంతో బూత్ కమిటీలను పక్కాగా నియమించామన్నారు. ప్రతి కుటుంబంతోనూ మమేకం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి బూత్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులంతా ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చేకూరిన లబ్ధిని వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు తూముల భాస్కరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 57 నెలల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా జనరల్ సెక్రటరీ వెంపల గురురాజు, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జానుమళ్లువలసలో..

సీతానగరం: మండలంలోని జానుమళ్లువలసలో 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. సీతానగరం మండల కేంద్రంలో సోమవారం 709 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటువంటి వివక్షత, అవినీతికి తావులేకుండా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జి, పార్టీ నాయకుడు బలగ శ్రీరాములనాయుడు, తహసీల్దార్ జీవీ జనార్దన్, రెవెన్యూ అధికారులు, మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, లబ్ధిదారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు: మెంటాడ మండలం జయతి, కొంపంగి, మీసాలపేట తదితర ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జయతి పంచాయతీకి చెందిన మీసాల అప్పలనాయుడు, మీసాల మహేశ్వరరావు, మీసాల రామకృష్ణ, మీసాల శివ, కొంపంగికు చెందిన కూనిబిల్లి అక్కునాయుడు, మీసాలపేటకు చెందిన మహంతిరామారావు, కలిశెట్టి కృష్ణ, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారందరికీ డిప్యూటీ సీఎం, గిరిజన శాఖామంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన కురుపాం పోలీస్ స్టేషన్ భవనం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు.

● **కురుపాం:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పాలకొండ రూరల్: ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న డ్వామా, ఉపాధిహామీ సిబ్బంది

పాలకొండ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామీణాభివృద్ధి శాఖ(డ్వామా) సిబ్బంది కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం ఎంపీడీఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 23 శాతం పీఆర్‌సీ అమలు చేయాలని, డ్వామా, ఉపాధిహామీ పథకాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గ్రేడ్లు అమలుచేయాలని, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సర్వీసుతో కూడిన ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కె.ప్రసాద్, పి.అప్పలరాజు, రోజారమణి, కంప్యూటర్ ఆపరేటర్లు కె.లక్ష్మి, సంధ్యారాణి తదితరులున్నారు.

కురుపాం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఎంపీడీఓ అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, జీతాలు పెంచాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేశారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



గురండి వద్ద రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: గ్రామీణ రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గురండి నుంచి నేరడి–బి వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామీణ రహదారులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు చెప్పారు. బిచ్చుమానుగూడ నుంచి జియ్యమానుగూడ వరకు రూ.1.50 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. లివిరి, తాలాడ బీటీరోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏబీరోడ్డు పనులు కొనసాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సర్పంచ్‌లు జామి భైరాగి, కొండగొర్రి సవిత, నిమ్మల కేశవ, పార్టీ నాయకులు సరిసాభద్ర బాలయ్య, కొండగొర్రి తమ్మారావు, అర్లి రాజశేఖర్, కీర్తి నూకయ్య, పిరపక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

మక్కువ: మండలంలో కొత్తకామునివలస గ్రామం పాఠశాలను ఎంఈఓ పి.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న గోరుముద్ద భోజనాలను పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. వంటల నాణ్యత, రుచిపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వంటి పెట్టాలని పథకం నిర్వాహకులకు సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పాలకొండ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.ఎన్.రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు, సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను మార్చి 5 నుంచి 10వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు లేని ఎడల 18సంవత్సరాలు నిండినవారిని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

నాగాభరణం వితరణ



స్వామివారికి నాగాభరణం అలంకరిస్తున్న దాతలు

పాలకొండ రూరల్: మండలంలోని పెద్దకోటిపల్లి గ్రామంలో కొలువైన విశ్వేశ్వరస్వామి ఆలయానికి పాలకొండ పట్టణంకు చెందిన న్యాయవాది ఏనుగుతల లక్ష్మణనాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయిని కృష్ణవేణి దంపతులు వెండి ఆభరణాలు, నాగభరణం వితరణ చేశారు. రూ.2 లక్షల విలువైన వెండి ఆభరణాలను సోమవారం ఆలయ అర్చకులు సత్యకుమార్‌కు అందజేశారు. పర్వదినాల్లో స్వామివారికి ఆ వస్తువులను అలంకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన రొక్కం నరసింహారావు(84) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే కళావతి సోమవారం పరామర్శించారు. నరసింహారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేడిబోయిన శ్రీవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం రామారావు, మేడిబోయిన చలపతి, తదితరులున్నారు.

ఎన్నికల నిబంధనలపై శిక్షణ

వీరఘట్టం: ఎన్నికల నిబంధనలపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఈనెల 6న సీతంపేట ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇంటింటి సర్వే పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఓ జగన్‌మోహనరావు

సీతానగరం: పల్స్‌పోలియో ఇంటింట సర్వేను జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) డాక్టర్ టి. జగన్‌మోహనరావు పరిశీలించారు. మండలంలోని బూర్జ, నిడగల్లు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి, మిగిలిపోయిన చిన్నారులకు సిబ్బంది వ్యాక్సిన్లు వేసిందీ, లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళవారం కూడా సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ వ్యాక్సిన్లు వేయాలనే ఉద్దేశంతోనే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. అనంతరం నిడగల్లు వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పెదంకలాం పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకాంత్, వైద్య సిబ్బంది నరసమ్మ, గౌరీశ్వరమ్మ, గాయత్రి, ధరణి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు గాను రూ.3.85 కోట్లతో ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యుత్‌శాఖ ఏడీఈ రంగారావు, ఏఈ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోండి: ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు

టిడ్కో ఇళ్లకు విద్యుత్ మీటర్ల కోసం సాలూరు ఎలక్ట్రికల్ సెక్షన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు విద్యుత్ మీటర్ల కోసం పార్వతీపురం డివిజన్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఒక కేవీ విద్యుత్ మీటర్‌కు రూ.269లు, 2 కేవీ సామర్థ్యం ఉన్న మీటర్లకు రూ.538లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చంద్రప్పవలస వద్ద 10/16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 31.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని వలన సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు ఓవర్ లోడింగ్ సమస్యలు ఉండవన్నారు. ప్రజలకు, రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సబ్‌స్టేషన్లు ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు రూ.350 కోట్లుతో 91 సబ్‌స్టేషన్లు మంజూరుకాగా ఇప్పటికి 9 పూర్తయ్యాయని, మరో 25 వివిధ దశలలో ఉన్నాయన్నారు. విజయనగరం జిల్లాలో జగనన్న లేఅవుట్‌లలో 29,156 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 9849 మందికి విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై ప్రజలు 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రూప్ హౌస్‌ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

● దిశ డీఎస్పీ హర్షిత



సమావేశంలో మాట్లాడుతున్న దిశా డీఎస్పీ హర్షిత

పార్వతీపురం టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దిశా డీఎస్పీ హర్షిత అన్నారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌ల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోక్సో, దిశా చట్టం, బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రతిఒక్కరూ మొబైల్ ఫోన్లలో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ మహిళలకు రక్షణ కవచం లాంటిదని.. ఆపద సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్, లక్ష్మణనాయుడు, సిబ్బంది, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది నిరసన



నిరసన తెలియజేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులు



సీతానగరం: ఎంపీడీఓ ఈశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సాంకేతిక సహాయకులు

బలిజిపేట: ఉపాధి హామీ పథకంలో 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న సీఓ, ఏఏఎస్, టీఏలకు గ్రేడ్లు ఇవ్వాలని కోరుతూ సిబ్బంది సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 2010 పీఆర్‌సీ ప్రకారం డీపీఓలకు గ్రేడ్లు ఫిక్స్ చేసి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, సెర్ప్ మాదిరిగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి..

సీతానగరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు ఎంపీడీఓ ఈశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసీ కృష్ణ, సాంకేతిక సహాయకుడు కూర్మారావు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన హామీ మేరకు సిబ్బందికి వేతనాలు పెంచాల్సి ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తక్షణమే జీతాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మణరావు, శ్రీదేవి, జానకి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.